# అక్రమం

చిత్రంగా...

అతి విచిత్రంగా నాకీ బయటి ప్రపంచపు శబ్దాలేవో లీలగా విన్పిస్తున్నాయి. అమ్మ గుండె చప్పుడు అద్భుతంగా ఉంది. నా చుట్టూ అమ్మ పొత్తికడుపులోని పేగులు చుట్టి ఉన్నాయి. చీకటి కుహరంలో ఉన్నాననిపించి అసహనంగా కదిలితే ఒక్కసారి అమ్మ అరచినట్టుంది....

అమ్మ మనసు మూలుగుతోంది.... ఆక్రోశిస్తోంది !

ప్రతి అరగంట కొకమారు అమ్మ చల్లని చేయి తన పొత్తికడుపును నిమురుతుంటె... నేను కరిగే వెన్నముద్దనవుతున్నాను.

అమ్మ అలా ప్రేమతో నిమురుతున్నపుడు ఆమె మనసు మాత్రం రోదిస్తోంది. తెరలు తెరలుగా గొంతుదాటి పోతున్న రోదన వింటుంటే... నా చిన్నిగుండె కూడా బాధిస్తోంది.

అమ్మ గుండె కవాటాలు లయతప్పి కొట్టుకుంటాయి ఒక్కోసారి.... నా చుట్టూ వున్న రక్తప్రసారాలు ఉవ్వెత్తున పొంగి పొర్లుతుంటాయి. హృదయం వూగిసలాడుతుంది. అంతే మళ్ళీ గుండె గదుల్లోంచి కన్నీళ్ళు ఖాళీ అవుతాయి.

బయట ఏదో రభస... అమ్మకు కోపమొచ్చినట్టు నాకు అవలీలగా తెల్సిపోతుంది. అప్పుడప్పుడూ ఎవరో వచ్చి నన్ను శతవిధాలా నొక్కి-

చూస్తున్నారు. ఎవరు?? బయటి ప్రపంచంలో ఎప్పుడు పడతానో?

ఊహూ... ఇప్పుడు పడను!!

"పరో వారంరోజులు పట్టవచ్చు...రేపు నర్సింగ్ హోంలో జాయిన్ చేయించండి" అని బయట అంటూంటే విన్లేదూ....

అప్పట్నించి బయట ఏదో హడావిడి జరుగుతోంది. పట్నానికి తరలిద్దాం అని మగ గొంతు అరచింది కాసేపు. పద్దండీ అంటూ బ్రతి మాలిన ఆడగొంతు. ఎవరో. ఆయన తాతయ్యకావచ్చు... ఆమె అమ్మమ్మ కావచ్చు.

అంతా నిశ్శబ్దమైందనుకున్న సమయంలో అమ్మ సన్నగా ఏడ్చింది. అమ్మ కంఠంలో వెక్కిళ్లు అడ్డుపడి తెరలు తెరలుగా పోతున్న దుఃఖం నాకు స్పష్టంగా కన్పిస్తోంది.

అమ్మ ఎందుకేడుస్తోంది?

నేను రావడం ఇష్టంలేదేమో??

అంతే... అంతకు ముందే పుట్టిన అక్కమీదో, అన్నమీదో ప్రేముండి వుంటుంది. హూ... ఇప్పుడేడుస్తుంది. తర్వాత.... తనను ప్రేమతో విమురుతుంది. అమ్మ మనసు ఎప్పుడెలా వుంటుందోనని నేనెప్పుడూ ఆమె హృదయం పై పే చూస్తుండి పోతున్నాను.

అమ్మ గొంతులోంచి అన్నంకూడా దిగిరావట్లేదు. అమ్మ ఎందు కిలా మారిపోతుంది? తిరగటం కూడా లేనట్టుగావుంది. అమ్మ ఎముకలు నేను లెక్కిస్తున్నాను.

అస్థిపంజరం లోంచి నేనెంత పలికినా ఆమెకు విన్పించదు.

అమ్మను నిన్నరాత్రి పన్నెండు గంటలకు ఎంతో దారుణంగా కదల కుండా మెదలకుండా పడుకోబెట్టారు. నేను కూడా ఎంత అవస్థపడ్డాను ఈ చీకటి గుహలో.

"ఈరోజు చంద్రగ్రహణం.... నువ్వు లేవకూడదు" అని బయట ఎవరో అమ్మమీద మాటిమాటికి విరుచుకుపడ్డారు.

పాపం అమ్మెంత బాధపడిందో??

కవాటాలు నెమ్మదిగా కొట్టుకుంటూ.... అమ్మ గుండె ఎంత చిక్కుకుపోయిందో నాకు కన్పిస్తోంది. ఇదంతా నావల్లనేనా? నాకూ చచ్చిపోవాలనిపిస్తుంది. కాని అమ్మ తన పొత్తికడుపును నిమిరేసరికి నాకు బ్రతకాలనిపిస్తుంది.

"ఈ రోజు సాయంత్రం మీ నాన్న వస్తార్రా కన్నా... అప్పుడు మనమిక్కడ్నించి వెళ్ళిపోతాం.... వూహుకాదు... ఈ రాక్షసుల మధ్య నించి పారిపోతాం" అని నిన్న అమ్మ తనమీద చెయ్యేసి ఎంత ప్రేమగా చెప్పింది.

ఇలా రోజూ అంటూనే వుంది... నాన్న క్యాంపు కెళ్ళిపోయాడేమో ?

సాయంత్రమయ్యిందా...ఏమో? నాకెప్పుడూ చీకటే... సాయంత్రమయినట్టుంది. అమ్మ మనసు పలవరిస్తోంది... అమితాష్... అమితాష్ అంటూ

నాన్న పేరు అమితాషా??

మరి అమ్మెందుకు ఏడ్చినట్టు... నేను చచ్చిపోయి వుస్తాననా ?

లేదమ్మా బయటికి రాగానే నిన్ను ముద్దాడుతాను తెలుసా?

అమ్మ మౌనంగా ఉండిపోయి ఎన్ని గంటలయిందో.... నాన్నమీద కోపమేమో?

అయ్యో... ఏమిటీ.... ఏం జరుగుతోంది... అమ్మ కంఠనాళాలు బిగుసుకు పోతున్నాయే... అమ్మ దేనినో తన్నేసింది.... గాలిలో ఊగుతోందా అమ్మ.... నాకూ ఊయల ఊగుతున్నట్టుగా ఉంది కాని... అదిగో రక్తప్రసారం నిశ్చలమై పోతుంది.... గుండె కవాటాల చప్పుడు తగ్గుతోంది. నాక్కూడా ఊపిరాడడంలేదు.

బయట ఎవరో ఏదో చప్పుడు చేస్తున్నారు. బాదుతున్నారు. అమ్మ ఇంకా గాల్లో వూగుతున్నట్టుగానే వుంది. అమ్మనించి శ్వాసరాక ఊపిరి

తిత్తులు ముడుచుకొస్తున్నాయి.

అమ్మా.... అమ్మా... మాట్లాడమ్మా... నేను అరచి గీపెట్టినా ఎవరికీ విన్పించదే?

పెద్ద శబ్దంతో ఏదో విరిగిన చప్పుడు!

గబగబా వచ్చి అమ్మ చుట్టూ మూగారేమో? ఎవరో మొత్తుకుంటున్నారు.... ఏడుస్తున్నారు. తిట్టుకుంటున్నారు. పదినిముషాలు సాగిన గందరగోళం తర్వాత అమ్మ శ్వాసనాళం లోంచి వచ్చినగాలి చల్లగా తగిలి గుండె జలదరించింది. కవాటాలు మృదంగాలై మ్రోగాయి. నాక్కూడా బలమొచ్చినట్టుగా ఉంది.

"పిచ్చితల్లి! ఎందుకు ఆత్మహత్య చేసుకోవాలని ప్రయత్నించిందో" ఎవరో అన్నమాట నాకు లీలగా అర్థమైంది. అమ్మకు స్పృహ వచ్చినట్టుగా వుంది. ఏడుస్తూనే వుంది, క్షణం తర్వాత నా గుండెలమీద గట్టిగా ఎవరో గుద్దారు.

"నాకు వీడొద్దు.... నాకు వీడొద్దు" అమ్మే అరుస్తున్నట్టుగా వుంది. అమ్మ పిడికిళ్ళతో తన కడుపుమీద గుద్దుకుంటుంది. ఆ పిడిగుద్దులు నా గుండెలమీద, కడుపుమీద తాకి ప్రాణాలు పోతున్నాయి,

"అమ్మా నన్నెందుకు చంపాలనుకుంటున్నావ్..." అమ్మ కడుపులోనే ఏడ్చాను, ఏడుస్తున్నాను.

నీరసపడిపోయిన అమ్మను ఈ రాత్రికి రాత్రే ఎటో తరలిస్తున్నారు. ఏం జరుగుతుందో. బయటి ప్రపంచంలోఏడుస్తున్నారు, తిట్టుకుంటున్నారు, ఓదార్చుకుంటున్నారు, ఎవరు వాళ్ళంతా! అమ్మ మళ్ళీ నన్ను ఆర్తిగా నిమిరి, అపారంగా ఏడ్చింది. అమ్మ చేష్టలు నాకేం అర్థంకాలేదు.

ఎక్కడికో ప్రయాణమయ్యాక, ఎవరో నన్ను నాలుగు దిక్కులా నొక్కి రేపు తప్పకుండా డెలివరీ అవుతుందనే మాట చెప్పిపోయారు.

అమ్మ గుండె వేగం పెరుగుతోంది నా రాకకోసం.

నరాలు ప్రకంపనాలై రక్తపోటు పెరుగుతుంటే... నేను కదిలాను. అమ్మ అరచింది. నడుమును పట్టుకొని నాలుగుదిక్కులా వంగిపోతుంటే.... విజయగర్వంతో కదిలాను.

అమ్మ గర్భాన్ని ఛేదించుకొని వచ్చిన మరుక్షణమే బొడ్డు ప్రేగు తెంపుకున్న నేను అమ్మనడిగింది ఒకే ఒక్క ప్రశ్న.

"అమ్మా నన్నెందుకు చంపాలనుకున్నావ్?" ఆపాటికి అమ్మ నుదిటి మీద స్వేద బిందువులు మెరుస్తున్నాయి. అమ్మ కళ్ళు వర్షిస్తున్నాయి.

"చెప్పమ్మా... నన్నెందు చంపాలనుకుంటున్నావు" మంచు ఖండాలన్నీ కదిలివచ్చి కన్నీరై నా చుట్టూ ఉన్న రక్తాన్ని కడిగేస్తూ రోదిస్తూ చెప్పింది.

"నా కింకా పెళ్ళికాలేదు నాన్నా..."అమ్మ గొంతు వణికింది. "నీకు పెళ్ళి కాకపోతే నేను రాకూడ..." నా మాట గొంతులోనే ఆగిపోయింది. అమ్మ బలమయిన చేతులు నా మెడచుట్టూ బిగుసుకుంటున్నాయి.

అమ్మ... అమ్మ నాకు... ఊపిరా... డడం లే ద మ్ మ్..."

★